క్లుప్తంగా

రైతులు అప్రమత్తంగా ఉండాలి



బాల్కొండ: రైతులు విత్తనాల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలని భీంగల్ డివిజన్ ఏడీఏ మల్లయ్య అన్నారు. మండలంలోని బోదేపల్లిలో రైతులకు బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. విత్తనాలు కొనుగోలు చేసే దుకాణాల్లో రసీదులు తీసుకోవాలని సూచించారు. లైసెన్స్ లేని దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. అనంతరం గ్రామంలోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. సమావేశంలో వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని రెండో వార్డులో అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న పనులను మున్సిపల్ కమిషనర్ రాజు బుధవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండాలని కాంట్రాక్టర్లకు సూచించారు. మున్సిపల్ పరిధిలోని 9 అమ్మ ఆదర్శ పాఠశాల్లో మౌలిక వసతుల పనులు చేపడుతున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే లోపు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ రఘు ఉన్నారు.

నిధులు మంజూరు

పెర్కిట్: ఆలూర్ మండలం దేగాం గ్రామంలో దళిత గోవిందంలో భాగంగా దళితవాడలో ఉన్న వేంకటేశ్వర స్వామి భజన మండపానికి తిరుమల తిరుపతి దేవస్థానం వారు రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు టీటీడీ శ్రీవారి ట్రస్టు నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరు చేస్తూ బుధవారం తెలంగాణ దేవాదాయ శాఖ నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్‌కు ప్రొసీడింగ్ కాపీని పంపారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం మంజూరైన నిధులతో మండప నిర్మాణాన్ని ప్రారంభించనున్నట్లు బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి యాదగిరి తెలిపారు.

అలరించిన జగన్నాథ శోభాయాత్ర



నవీపేట: మండల కేంద్రంలో బుధవారం రాత్రి నిర్వహించిన జగన్నాథ శోభాయాత్ర భక్తులను ఆకట్టుకుంది. భగవద్గీత శ్లోకాలతో పాటు భక్తి పాటలతో వీధుల గుండా నృత్యాలు చేశారు. భగవద్గీతపై అవగాహన కల్పించేందుకు ఈ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ ప్రతినిధులు పేర్కొన్నారు. రామానందగౌరవ ప్రభూజీ, లోకేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బడిబాట



బాల్కొండ: తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ ముప్కాల్ మండల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్కాల్, వేంపల్లి, నల్లూర్ గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, గతేడాది విద్యార్థులు సాధించిన విజయాల గురించి వివరించారు. సర్కార్ బడిలో చదివితేనే పిల్లలు ఉన్నత స్థాయికి చేరుతారని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గంగారాం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని ఖిల్లా రఘునాథ ఆలయం వద్ద బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా పండితులు కందాలై నరసింహమూర్తి, నాని స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ ముక్కా దేవేందర్ గుప్తా, సభ్యులు తాటి వీరేశం దాతలకు సన్మానం నిర్వహించారు.

కీలక నేత అండతో ఇసుక దందా!

- అక్రమంగా తరలుతున్న ఇసుక
- పట్టించుకోని అధికారులు



బెజ్జోరాలో తవ్వకాలు చేపడుతున్న ప్రాంతం



బెజ్జోరాలో డంపు చేసిన ఇసుక నిల్వలు

భీమ్‌గల్: దోచుకోవడానికి కాదేదీ అనర్హం.. దోచుకున్న వారికి దోచుకున్నంత అన్న చందంలా సాగుతుంది భీమ్‌గల్ మండలంలో ఇసుక మాఫియా దోపిడీ. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సహకారంతో ఇసుక అక్రమదారుల చెంతకు తరలుతోంది. నిబంధనలను టిప్పర్ చక్రాల క్రింద తొక్కుకుంటూ దోపిడీదారుల జేబుల్లోకి కాసుల రూపంలో చేరడంతో అధికారుల నిస్సహాయతను వెక్కిరిస్తోంది.

వాల్టా చట్టానికి విరుద్ధంగా మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఇసుకకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలను ఇసుక తవ్వకాలకు ఇసుక వ్యాపారులు ఎంచుకుంటున్నారు. నిత్యం రాత్రి వేళల్లో ఇసుక తవ్వకాలు చేపడుతూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పలువురు వ్యాపారులు వ్యవసాయ పొలాల వద్ద నిలువ చేసి అదును చూసి రవాణా చేస్తూ రూ. లక్షలు అర్జిస్తున్నారు. మండలంలోని బెజ్జోరా గ్రామంలోని రెండు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఇసుక తవ్వకాలు చేపడుతూ ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుక రవాణా కొనసాగిస్తున్నారు.

పట్టించుకోని యంత్రాంగం

మండలంలో ఇసుక మాఫియా రెచ్చిపోతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. యథేచ్ఛగా రాత్రి వేళల్లో ఇసుకను డంప్ చేస్తున్న విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు మాముళ్లు అందడంతోనే ఇసుక వ్యాపారులు ఇంతలా రెచ్చిపోతున్నారనేది బహిరంగ రహస్యం. వారికి అందాల్సిన ఆమ్యామ్యాలు అందితే చాలు ఇసుకాసురులకు అండగా నిలుస్తున్నారని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

తాము అధికారంలోకి వస్తే..

తాము అధికారంలోకి వస్తే ఇసుక అక్రమ రవాణాను అరికడతామని, వారి వెనుక ఎవరున్నా వదిలి పెట్టమని అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు చెప్పిన కాంగ్రెస్ నాయకులే ఇప్పుడు వారికి అండగా నిలుస్తుండడంపై మండల ప్రజలు పెదవి విరుస్తున్నారు. అధికార పార్టీ నాయకులే ఇసుక అక్రమ వ్యాపారానికి అండగా నిలుస్తుండడంపై సంబంధిత రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఇటు వైపు చూడడం లేదు. దీంతో అధికారుల పనితీరుపై విమర్శలు వెల్లువెతుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇసుక అక్రమ రవాణాపై తహసీల్దార్ శ్రీలతను ఫోన్‌లో వివరణ కోరగా ఆమె స్పందించలేదు.

అభివృద్ధి పనుల పైసలు ఇస్తలేరు

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం

నందిపేట్: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పైసలు రావడం లేదని ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు వెడల్పు పనుల్లో అడ్డుగా ఉన్న సెప్టిక్ ట్యాంకు, బోరుబావులను తొలగించాలని మండల కోఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీ రాజులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మిషన్ భగీరథ నీరు ఇప్పటికీ రావడం లేదని, మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నిరంతరం లీకేజీలు అవుతున్నాయని సొసైటీ చైర్మన్ మీసాల సుదర్శన్ ఆరోపించారు. ఐదు నెలల్లో 223 కుక్క కాటు కేసులు, 2 డెంగీ కేసులు నమోదయ్యాయని వైద్యాధికారి తెలిపారు. ఉమ్మడి నందిపేట మండలంలో 12 జీపీ బిల్డింగ్‌లు మంజూరు కాగా ఇప్పటి వరకు 10 పనులు ప్రారంభం కాలేదని పీఆర్ ఏఈ తెలిపారు. ఈజీఎస్ కూలీలతో చెరవు కట్టకు మరమ్మత్తులు చేపట్టాలని ఎంపీపీ కోరారు. ఈ ఏడాది 3.30 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఈజీఎస్ ఏపీవో తెలిపారు. 2019–20లో చేపట్టిన ఇంకుడు గుంతల పనుల డబ్బులు రాలేదని ఎంపీటీసీ సంజీవ్ ఆరోపించగా పై అధికారులతో మాట్లాడి డబ్బులు ఇప్పించేందుకు కృషి చేస్తానని ఎంపీడీవో శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ దేవేందర్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ హుస్సేన్, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గంగారాం, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



నందిపేట్ మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సంతోష్‌రెడ్డి

అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



వర్ని: తాగునీటి సరఫరా శాఖ అధికారుల నిర్లక్ష్యంపై మండల సభలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఇటీవల గ్రామాల్లో తాగునీటి అవసరాలకు వేసిన బోర్లు స్థానిక ప్రజాప్రతినిధులకు, మండల అధికారు లకు, ప్రజలకు సంప్రదించకుండా ఇరిగేషన్ నీటిపారుదల శాఖ అధికారులు ఇష్టానుసారంగా వేయడంతో వృథా అయ్యాయని ఎంపీపీ మేక శ్రీలక్ష్మి, మండల ఉపాధ్యక్షులు బాలరాజు, జాకోరా ఎంపీటీసీ సాయిలు అధికారులపై మండిపడ్డారు. మిషన్ భగీరథ పైప్ లైన్లు పగిలిపోయి నెలలు కావస్తున్నా మరమ్మతులు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులకు అటవీశాఖ అనుమతులు లేకుండా పనులు ఎలా ప్రారంభించారని జెడ్పీటీసీ హరిదాసు అధికారులను ప్రశ్నించారు. విధులపై నిర్లక్ష్యం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సత్యనారాయణపురం ఎంపీటీసీ వెంకట రమణి ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌ను ప్రశ్నించారు. సభకు హాజరుకాని అధికారులపై చర్యలకు సిఫారసు చేయాలని సమావేశంలో తీర్మానించారు. ఎంపీడీవో వెంకటేశ్వర్, తహసీల్దార్ సాయిలు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి



పనుల వివరాలు తెలుపుతున్న ఎంఈవో

బాల్కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ యామాగంటి లావణ్య అన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్కార్ బడుల బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శ్రీకాంత్, జెడ్పీటీసీ లావణ్య, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వినోద్, ఎంఈవో రాజేశ్వర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుపై అధికారుల నిర్లక్ష్యం



డంపింగ్‌యార్డులో చెత్తకు అంటుకుంటున్న నిప్పు

- చెత్త నుంచి ఎరువు తీయకుండా కాల్చివేత

ఆర్మూర్‌టౌన్: పట్టణ కేంద్రంలోని డంపింగ్ యార్డుపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పట్టణ కేంద్రం నుంచి ప్రతి రోజు టన్నుల కొద్ది చెత్త ఈ యార్డుకు వస్తుంటుంది. ఈ చెత్తను తడి, పొడిగా వేర్వేరు చేసి ఎరువుగా మార్చితే శాఖకు ఆదాయం సమకూరుతుంది. కానీ ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టంలో విఫలమవుతున్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌లోని బైపాస్ రోడ్డులో 5 ఎకరాల్లో డంపింగ్ యార్డును ఏర్పాటు చేశారు. అలాగే తడి, పొడి ఎరువులను తయారు చేసే విధంగా డంపింగ్ యార్డులో నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం అవి వృథాగా మారాయి. ప్రతిరోజు మున్సిపల్ పరిధిలోని 36 వార్డుల నుంచి సుమారు 30 టన్నుల చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. రెండు నెలల నుంచి చెత్తకుప్పలకు పలుమార్లు మంటలు అంటుకున్నాయి. దీంతో చెత్త దగ్ధమవుతోంది. అధికారులు సకాలంలో స్పందించి చెత్తను ఎరువుగా మార్చితే ఆ శాఖకు ఎంతో ఆదాయం తెచ్చిపెట్టేది. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. డంపింగ్ యార్డులో వెలువడుతున్న పొగతో రహదారి గుండా వెళ్లే ప్రయాణీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా వాతావరణం కాలుష్యమవుతోంది. స్థానికులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



డంపింగ్ యార్డులో మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకుంటాం. యార్డులో తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి ఎరువుగా మారుస్తాం. ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకుంటాం. – ఎ రాజు, మున్సిపల్ కమిషనర్

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి



వేల్పూర్‌లో దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై, ఏవో



ఏర్గట్లలో ఎస్సై మఛ్చేందర్‌రెడ్డి



కోటగిరిలో వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు

వేల్పూర్/ మోర్తాడ్/ రుద్రూర్/ వర్ని/ బోధన్ రూరల్/ మాక్లూర్: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని వ్యవసాయ, పోలీసు అధికారులు ఎరువుల దుకాణదారులకు సూచించారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో ఎరువులు, విత్తనాల దుకాణాలను అధికారులు బుధవారం పరిశీలించారు. వేల్పూర్ మండల కేంద్రంలో ఎస్సై వినయ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి నర్సయ్య ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏర్గట్ల మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాలను ఎస్సై మఛ్చేందర్‌రెడ్డి తనిఖీ చేశారు. విత్తనాలు తీసుకున్న రైతులకు తప్పకుండా రసీదులు అందించాలన్నారు. ఆయన వెంట ఏఈవో సాయి సచిన్, సిబ్బంది ఉన్నారు. కోటగిరి మండలంలోని విత్తన డీలర్ల దుకాణాలను మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు, ఎస్సై సందీప్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి నమూనాలు సేకరించారు. అనంతరం చావిడి వద్ద రైతులతో సమావేశమై విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి వ్యవసాయాధికారి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తీర్ణాధికారి అస్మా బేగం తదితరులు ఉన్నారు.



బోధన్‌లో సీఐ నరేశ్, ఎస్సై నాగనాథ్, ఏఈవో సాయిలు

వర్ని మండల కేంద్రంలో ఎరువులు, విత్త నాల దుకాణాలను పోలీసు, వ్యవసా య శాఖ అధికారులు తనిఖీ చేశారు. రైతులకు నా ణ్యమైన విత్తనా లు విక్రయించాలన్నారు. ఎస్సై కృష్ణకుమార్, సిబ్బంది ఉన్నారు.

బోధన్, సాలూర మండలాల్లోని గ్రామాల్లో ఎరువులు, విత్తనాల దుకాణదాలను బోధన్ రూరల్ సీఐ నరేశ్ తనిఖీ చేశారు. దుకాణదారులు తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. రికార్డులు నిర్వహణ పారదర్శకంగా ఉండాలన్నారు. నిబంధనాలకు విరుద్ధంగా పాల్పడితే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో ఎస్సై నరేశ్, ఏఈవో సా యిలు పాల్గొన్నారు. మాక్లూర్ మండల కేంద్రంలో ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి పద్మ తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలన్నారు. అనంతరం దుకాణాల్లో ఉన్న స్టాకును పరిశీలించారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.



వర్నిలో దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు



మాక్లూర్‌లో మండల వ్యవసాయాధికారి పద్మ

ఆలయ హుండీ లెక్కింపు



నిజామాబాద్‌రూరల్: నగరంలోని మాధవనగర్ సాయిబాబా ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ, ఆలయ ఏవో శ్రీరాంరవీందర్‌గుప్తా ఆధ్వర్యంలో హుండీలను తెరిచారు. రెండు నెలల నాలుగు రోజుల్లో హుండీ ద్వారా రూ.3,02,485 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్ పేర్కొన్నారు. ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బోధన్‌టౌన్: పట్టణంలోని ఆచన్‌పల్లి గ్రీన్‌ల్యాండ్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏక గ్రీవంగా బుధవారం ఎన్నుకున్నారు. ఈ నూత కార్యవర్గం మూడేళ్ల పాటు కొనసాగనుంది. అధ్యక్షుడిగా బీర్కూర్ శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శిగా కొమ్మినేని వెంకటేశ్వర్‌రావు, కోశాధికారిగా ముక్తినేని వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా నాగార్జున గౌడ్, సహాయ కార్యదర్శిగా వేణుగోపాల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా నూనె జగపతిరావు, మద్దినేని పార్వతి, జెట్టి హన్మంత్‌రావు, శివారెడ్డి, వంశీకృష్ణారెడ్డి, ఉప్పు లక్ష్మణ్, లీగల్ అడ్వైజర్‌గా నరసింహారెడ్డి ఎన్నిక అయ్యారు. ఎన్నికల అధికారిగా బాల గంగాధర్‌రావు, సహాయ ఎన్నికల అధికారులుగా మహేశ్, కృష్ణా రెడ్డి వ్యవహరించారు.

ఆర్టీసీ డీఎంకు వినతి

బోధన్: ఇటీవల నూతనంగా ఎన్నికైన ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రీజినల్ కమిటీ ప్రతినిధుల బృందం బుధవారం బోధన్ ఆర్టీసీ డిపో అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. డిపో ఉద్యోగుల సమస్యల పరిష్కార అంశాలపై చర్చించి డీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. త్వరలోనే డిపో ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రతినిధులు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎం శ్రీనివాస్, ఎంఎఫ్ హరిప్రసాద్, సీఐ జానాబాయి, పరిపాలనాధికారి గిరి, ఎస్‌టీఐ లక్ష్మణ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. వెల్ఫేర్ అసోసియేషన్ రీజినల్ కమిటీ కార్యదర్శి మధుకర్, సహాయ కార్యదర్శి రవీందర్, ఆర్గనైజేషన్ కార్యదర్శి మోహన్, ప్రచార కార్యదర్శి దత్తాత్రి, ఉపాధ్యక్షుడు నవీన్, డిపో ఉద్యోగులు నర్సింలు, రత్నం, దేవేందర్, సురేశ్, లక్ష్మణ్, రాజు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ఎంపీని కలిసిన నాయకులు



నందిపేట్: మండలంలోని బీజేపీ నాయకులు ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను బుధవారం జిల్లా కేంద్రంలో కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల సరళి గురించి చర్చించారు. స్థానిక సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీని కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు భూతం సాయిరెడ్డి, అరుట్ల రమేశ్, మరంపల్లి గంగాధర్, పెయింటర్ రాజు, నాగ సురేశ్, చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – ఫ్యూరియోసా (తెలుగు) - 12.25, రాజుయాదవ్ (తెలుగు) - 3.40, 6.20, 9.00

స్క్రీన్-3 – లవ్‌మీ (తెలుగు) - 11.50, ఫ్యూరియోసా (తెలుగు) - 02.45, 6.00, 9.15

స్క్రీన్-4 – లవ్‌మీ (తెలుగు) - 1.30, 4.25, 7.20, 10.15

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- ఎన్‌పీడీసీఎల్ సీజీఎం అశోక్

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ నగరవాసులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని ఎన్‌పీడీసీఎల్ సీజీఎం అశోక్ అన్నారు. నగరంలోని సుభాష్‌నగర్ సబ్‌స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న 5.00ఎమ్‌వీఏకు అదనంగా 3.15ఎమ్‌వీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుభాష్‌నగర్ ప్రాంతంలోని హమాల్‌వాడీ, కంఠేశ్వర్, విద్యుత్‌నగర్, బ్యాంక్‌కాలనీ, నాందేవాడ, పాముల బస్తీ ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి కెపాసిటి పెంచినట్లు తెలిపారు. ఇందుకు గాను రూ. 40లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఎస్ఈ రవీంధర్, డీఈలు ఎం శ్రీనివాస్ రావు, రాజేశ్వర్‌రావు, ఏడీఈ తోట రాజశేఖర్, చంద్రశేఖర్, ఏఈ గంగాశేఖర్, సుమిత, గంగారం, ఇలియాస్, దేవిదాస్, గజేందర్, దశరథ్, రమేష్, సంజీవ్, ప్రేమ్‌లాల్, కృష్ణయ్య, సుదాకర్, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ తనిఖీ

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ డిచ్‌పల్లి సెక్షన్ కార్యాలయాన్ని బుధవారం సీజీఎం అశోక్‌కుమార్ సందర్శించి, తనిఖీ చేశారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. వ్యవసాయ ఫీడర్ల ద్వారా రైతులకు అందిస్తున్న విద్యుత్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్, డీఈ ఉత్తమ్‌కుమార్ జాడే, ఏడీ శ్రీనివాస్, ఏఈ సాయిలు తదితరులున్నారు.

విత్తనోత్పత్తి కర్మాగారం తనిఖీ



నిజామాబాద్‌రూరల్: మండలంలోని సారంగాపూర్ గ్రామంలో గల విత్తనోత్పత్తి కర్మాగారాన్ని సీఐ సురేష్‌కుమార్, ఏవో జాదవ్ హీరా బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కర్మాగారంలో నాణ్యత లోపించిన విత్తనాలు రైతులకు విక్రయించరాదని పేర్కొన్నారు. రైతులకు విత్తనాలు విక్రయించే ముందు విత్తనాలకు సంబంధించిన రశీదును ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు విడి విత్తనాలు కొనుగోలు చేయరాదని ప్రభుత్వంచే గుర్తింపు పొందిన కంపెనీల ద్వారా సరఫరా చేసే విత్తనాలను కొనుగోలు చేయాలని కోరారు. కర్మాగారంలో ఇప్పటి వరకు ఇచ్చిన విత్తనాలకు రశీదులను , బిల్‌బుక్‌లు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది, ఏఈవోలు పాల్గొన్నారు.